# భాగ్యం

పోలిసెట్టి నాగేశ్వరరావు

స్త్రీల మధ్యలో ఒక అందాలరాణి కూర్చుని శారదా దేవిలాగ వీణ వాయిస్తూ పాడుతూ వుంది, అంతా పాట వింటున్నారు, ఎవరు వివాహమాడుతారోగాని నిజంగా అతడు 'ధన్యుడు' అనుకున్నాను. అసలు ఆ అమ్మాయి ఎవరో? ఎవరినడిగితే బాగుంటుందని ఆలోచించి మా పెద్దమ్మ దగ్గరకు వెళ్లాను.

"పెద్దమ్మా ఎవరే ఆ అమ్మాయి?"

"మా అన్నయ్య కూతురురా. కొత్తగా అడుగుతున్నావేం? చిన్నతనంలో మీరిద్దరూ విడపకుండా ఆడుకునేవాళ్లు. గుంటూరునుంచి నిన్నే వచ్చింది"

'ఓహో! సుందరా! ఎవరో అనుకుంటున్నా'

"ఆఁ! సుందరే! పిల్ల బాగుందా?"

"ఆవులిస్తే పేగులు లెక్కపెట్టేస్తావు పెద్దమ్మా"

"ఆ పిల్ల సంగతి మరి నీకెందుకురా?" ఇంకా నాచే ఏదో చెప్పించాలని ఆ ప్రశ్న వేసింది.

"అబ్బే! మరేంలేదు. మనింటికి కొత్త మ్మాయి ఎవరా వచ్చిందని అడిగాను"

"ఉండు....దాన్ని పిలుస్తాను"

"అయ్యో! యిదేమిటి పెద్దమ్మా....ఎందుకు ఆ అమ్మాయిని పిలవటం?" ఆమె పిలుస్తున్నందుకు లోపల ఎంతో సంతోషిస్తున్నా, బాగుండదని పైకి అలాగ అన్నాను.

"సుందరీ....సుందరీ"

"వస్తున్నానత్తా" అంటూ వచ్చి నన్నుచూసి సిగ్గుతో తలుపు చాటుకు పోయింది.

"ఇలారా లోపలికి....ఎవరనుకుంటున్నావ్? మన సుందరంబావే"

"అయ్యో! ఎవరో అనుకున్నానత్తా....నమస్కారం బావా" అంది తేనెలొలుకుతూ.

"ఎంత పెద్దదానవై పోయావ్ సుందరీ, పెద్దమ్మ చెప్పేవరకూ నిన్ను పోల్చుకోలేక పోయాను"

"మీరు అలాగే వుండిపోయారేం? మీలాగే నేనూను"

"మా మరదలికి మాటలు బాగా వచ్చు" అందరం నవ్వుకున్నాం.

"కాఫీ వేళయింది, బావకు కాఫీ తెచ్చి యివ్వవే" అంటూ మా పెద్దమ్మ పనులు చక్కబెట్టుకోటానికి వెళ్ళిపోయింది, సుందరికూడా ఆమెవెంట వెళ్ళిపోయింది. వేడి నిట్టూర్పులు విడుస్తూ సోఫామీద కూలబడ్డాను.

కొంతసేపటికి సుందరి కాఫీ తీసుకువచ్చింది. నా ఆనందానికి హద్దులు లేవు - ఆమెను ఏమన్నా అనాలనిపించింది -

"పెళ్ళికూతురు లాగ ముస్తాబయ్యావు".... అన్నా - నాప్రక్కన కూర్చుంది నవ్వుకుంటూ -

"కాఫీ బాగుందా?" అని అడిగింది -

"నీ పాటలాగే మధురంగా వుంది"

"నేనంతకన్నా బాగా పాడ్తాను"

"ఎప్పుడు?"

"ఎప్పుడా.... నీ పెళ్ళికి" అంది నవ్వుతూ -

"నా పెళ్ళిమాటకేంలే" అన్నా విచారంగా ఆమెవంక చూస్తూ,

"ఏం అలా అన్నావు- అయినా యింకా పెళ్లి చేసుకోలేదేం బావా?"

"నిజం చెప్పనా.... మరేంలేదు - నీలాంటి పిల్లదొరక్క"

"దొరికిందనుకో"

"చేసేసు కున్నానే అనుకో!"

ఇద్దరం నవ్వుకున్నాం - మాకుదూరంగావున్న అద్దంలో మా ప్రతిబింబాలు కనబడ్డాయి- ఆదర్శ దంపతులలాగ వున్న మా గ్రూక్యాన్ని చూచి మురిసి పోయాను - ఆమె వెళ్ళిపోయింది- మా పెద్దమ్మ అక్కడికి వచ్చింది

"తొందరగా నువ్వొక యింటివాడ వయితే చూడాలని వుందిరా పిల్లకోసం వెతుక్కోనక్కర లేదుకూడా'' అంది.

"ఎవరాపిల్ల?"

"సుందరిరా" ఆ మాట అనగానే సంతోష సముద్రంలో మునిగి పోయాను.

"మరి నీ అభిప్రాయం?" అన్నాది, సుందరి ఆవిడ అన్నదమ్ముడిబిడ్డ,

'నా అభిప్రాయానికేం గాని సుందరి ఒప్పుకో వద్దూ" అన్నా, నామాటలువిని సుందరి నవ్వుతూ వుంది.

''అది ఒప్పుకునే దేమిటి? నీకిష్టమయితే నేనుచేస్తాను"

"నీమాట కాదంటానా పెద్దమ్మా నీయిష్టప్రకారమే కానియ్''

నేను పెద్దమ్మ వద్ద సెలవు తీసుకొని వెళ్ళిపోతున్నాను. సుందరి గుమ్మానికి తల ఆనించి దీనంగా చూసింది. ఆనాటి ఆమె దీనవదనం ఏనాటికీ మర్చిపోలేను, ఆమె నా హృదయమంతా నిండివుంది. ఈ విశాల విశ్వమంతా నిండివుంది.

పరీక్షలు యింకా నెలరోజులున్నవి- నాగదిలో కూర్చుని చదువు కుంటున్నాను - నా గదితలుపు ఎవరో తట్టినట్లు చప్పుడయ్యింది - తలుపు తెరచి చూశాను - ఎక్కడనుంచో నాకు టెలిగ్రాం వచ్చింది - హాస్టల్లో చదువుకుంటున్నందువల్ల మాయింట్లో యెవరికేం ప్రమాదం సంభవించిందోనని నాగుండెలు వేగంగా కొట్టుకున్నవి- కంగారుగా విప్పిచూశాను.

కారణం లేకుండా కంగారుపడినందుకు నాలో నాకే నవ్వువచ్చింది, టెలిగ్రాంమాత్రం మాయింటి వద్దనుంచిగాని. అబ్బే! చెడుఏమీలేదు - ఒకశుభ వార్త! "నీ వివాహం నిశ్చయం చేశాం.... ముహూర్తం సరిగ్గా మూడు రోజులుంది.... వెంటనే బయలుదేరి యింటికిరా...."

ఈ వార్త చూచి చాలా ఆశ్చర్య పోయాను - నా వివాహం యింతవరకు నా యిష్టానుసారంగా జరుగుతుందనుకున్నాను - కాని ఈ రోజుతో నాఆశలన్నీ నిరాశలైనవి -

కొద్దినిముషాల్లో ఈవార్త నా స్నేహితు లందరికి తెలిసిపోయింది - ఇంతమందికి తెలియగా మా'రావు' కేనా తెలియకుండా వుండేది - రావు నాప్రాణ స్నేహితుడు- వాడిని కలుసుకోకుండా నేనూ, నన్ను కలుసుకోకుండా వాడూ, ఒక్క రోజుకూడా గడచి పోనివ్వం - హోటల్లో కాఫీ తాగుతుండగా తెలిసిందట - తాగేతాగే కాఫీ అక్కడ వుంచేసి, ఒక్కగంటులోవచ్చి నాగదిలో వాలాడు -

''కంగ్రాట్యులేషనోప్స్"

నేను మాట్లాడకుండా పూరుకున్నాను -

"టీపార్టీ మాట దేవుడెరుగును - అనబ 'థ్యాంక్సు' అన్నా చెప్పవేరా" అన్నాడు -

నా లోపలిబాధ వాళ్ళకేం తెలుసు?

మా వూరిలో రైలుదిగి జట్కా వేసుకుని మా యింటికి బయలు దేరాం - నా ముఖంలో నవ్వు లేదు, మాయిల్లు దూరంనుంచి చూశాను- అంతా కొత్తగా కన్పించింది - మాయింటికి చేరేసరికి- మాయిల్లు తెల్లని గోడలతో. గుమ్మంముందు బ్రహ్మాండమైన పందిరితో, పచ్చని మామిడాకు తోరణాలతో, విద్యుద్దీపాలతో, కిటకిటలాడుతున్న బంధు మిత్రులతో సేవకులతో ఆనందమయంగా వుంది, పెళ్లికివచ్చినస్త్రీలంతా సీతాకోకచిలుకల్లాగ రంగురంగుల కోకలు ధరించి యిటూఅటూ తిరుగుతున్నారు, మల్లెపూలు, గంధం, పన్నీరుల సువాసనలతో ఆప్రదేశమంతా వ్యాపించిపోయివుంది,

ఈదృశ్యమంతా చూసేసరికి, ఈఏర్పాటులన్నీ నాకోసమేకదాఅని నాకు అమిత గర్వంవచ్చింది. నేను చక్రవర్తినై పోయినట్లుగా తోచింది. గర్వంగా బండిదిగాను.

మా చిన్నచెల్లాయి నన్ను అంతమందిలో ఎలా చూచిందోగాని "అమ్మా! అన్నయ్య వచ్చాడేవ్" అని పెద్దకేక వేసింది. ఒక్కగంతులో నాదగ్గరకువచ్చి నాచెయ్యిపట్టుకుని 'ఏమిటన్నయ్యా రావటానికి యింతఆలస్యంచేశావ్? నువ్వు తొందరగారాలేదని నాన్న కోప్పడుతున్నారు" అంది.

మానాన్నంటే నాకు మహాభయం. 'నాన్న వున్నారా?' అని చెల్లినిఅడిగాను. వున్నారంది. అంతలోనే అమ్మ ఆతృతోవచ్చి 'నాతండ్రీ. వచ్చావా.... నీకోసమే ఎదురుసూస్తున్నాంనాయనా! అంటూ లోనికి తీసుకుపోయింది.

మానాన్న ఎదురుగావచ్చాడు, "ఏమోయ్! యింతతొందరగా వచ్చావేం? రేపువస్తే యింకా బాగుండేదిగా, ఆముహూర్తం కాస్తాదాటిపోయేది. నామాటంటే బొత్తిగా నీకులక్ష్యంలేదురా." అన్నాడు. ఆయనకు ఏమిసమాధానంచెప్పాలో తోచక బుర్రగోక్కుంటున్నాను

అంతలోనే మా అమ్మఅందుకుంది. 'బాగుందండీ అప్పుడేమొదలుపెట్టారూ. ఎప్పుడువస్తేనేం ఇక్కడ వాడుచేసేపనులు ఏమీమిగిలిపోలేదులెండి. వాడుచదువుకుంటున్నాడు. ఆడుకోటంలేదు రానాయనా! భోంచేద్దువుగాని." అమ్మజవాబుతో బ్రతికానురా దేవుడా అనుకున్నాను.

'నీకేకాదు నాకూతెలుసు చదువుకుంటున్నట్టు' అని వురిమాడు నాన్న.

మా అమ్మదగ్గర ఎంతిచనువుగా వుంటానో, మానాన్నదగ్గర అంతభయంతో పిల్లిదగ్గర ఎలుకలాగ వుంటాను, ఆ భయమేలేకపోతే యీపాటికి నాపెళ్లి ఆవుజేయించేవాడిని. భోంచేస్తున్నా అమ్మ దగ్గరకూర్చుని వడ్డిస్తూవుంది.

"అమ్మా! అమ్మాయి ఎలావుంటుంది?" అన్నాను మెల్లగా. ఎక్కడవిన్నాడో మానాన్న. "ఎలావుంటే నీకొందుకోయ్. అందం కొరుక్కుతింటావా?" అంటూ వెళ్ళిపోయాడు.

"నాన్నతో యిదేచిక్కమ్మా. తనుపట్టిందే పట్టు. నాతోసంప్రదించకుండా నాకుపెళ్లేమిటమ్మా" నాన్నకంతా కంగారుగావి" అన్నాను.

"మీనాన్న మాటలకేంగాని, నామాట నమ్ము నాయనా. పిల్ల రంభలాగవుంటుందిరా.........లేకపోతే మీనాన్నమాట అలావుంచు. నేను ఒప్పుకుంటానా" అంది అమ్మ.

"నిజంఅన్నయ్యా.........వదినే బంగారపు బొమ్మలా వుంటుంది" అంది మాచిన్నచెల్లాయి.

"అలాగంటే చిట్టితల్లీ" అంటూ గదిలోకి పోయాను. మంచంమీద పండుకున్నాను మనస్సు మాత్రం చాలా అసంతృప్తిగా వుంది.

నేనే వివరాలూఅడగలేదు. అడిగి ప్రయోజనమేమిటి? నాన్న నిశ్చయించుకొచ్చాడు. ధిక్కరించడానికి నాకు స్తోమతలేదు. శుభలేఖమాత్రం తిరగల్లా బోర్లా వేసి చూశాను. చాలాఖరీదైన ఆర్టు పేపరుమీద అచ్చువేశారు. పెళ్ళికూతురుపేరు వెంకటలక్ష్మి. ఇహ వెంకటలక్ష్మి అని పిలుస్తూ యావజ్జీవితం గడపవలసిందే!

మరుసటిరోజు పెళ్ళి. నీరసంగా నిద్రనుంచి లేచాను. పెళ్ళివారంటికి తర్లివెళ్లాలి, మావూళ్లోనే వారి వసతిగృహంలో వివాహం జరుగుతుంది. మా పెద్దమ్మవచ్చి పలకరించింది. ఆవిడావచ్చింది. నాపెళ్లికి! సుందరి మేనత్త.

"నీపెళ్ళికొచ్చాను చూశావా?" అంది

"చూశాను"

"మొత్తానికి ఒకయింటివాడవయావు." అంది.

"ఏమి అవడం"

"ఏంనాయనా?"

"నచ్చినపిల్లకాదే?"

"ఏంబిడాయిరా? ఇంకొఅందమైంది వస్తుందా"

"నీకు దయలేకపోయింది. నువ్వు తలపెడితే నాకు అందగత్తె దొరకకపోనా?" అన్నాను.

"పోనీ ఇంతే నేచేసుకొంది అనుకో" అంది.

వధువును పెళ్ళిపీటలమీద చూడ్డంఅయింది, నా ఆశ్చర్యం ఏమనిచెప్పడం? పెళ్ళి ఒకసభ అన్నసంగతి నాకుగుర్తులేదు. అక్కడ చుట్టూ ఎవరెవరున్నదీ చైతన్యంలేదు.

"నీపేరు వెంకటలక్ష్మి?" అని పెళ్లికూతుర్ని అడిగాను. అంతా విరగబడినవ్వారు. పెళ్లికూతురు మొహమాటం సిగ్గు అభినయిస్తున్నా మెల్లిగా చెప్పింది. "కాదు సుందరి" అని

పక్కనున్న మా పెద్దమ్మ ఏంనాయినా సుందరి ఇప్పు డెలాగుంది?" అనడిగింది.